క్లుప్తంగా

శ్రీవారి సేవలో జబర్దస్త్ టీం



శ్రీవారి నిత్య కల్యాణ మండపం వద్ద అభిమానులతో జబర్దస్త్ టీం

ద్వారకాతిరుమల: చిన వెంకన్న దివ్య క్షేత్రాన్ని ఆదివారం జబర్దస్త్ టీం సందర్శించింది. ఆలయానికి విచ్చేసిన జటాం నవీన్ (అభిరాం టీం), అప్పారావు, వినోద్ (చమక్ చంద్ర టీం) ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయం నుంచి బయటకు వచ్చిన వారితో పలువురు భక్తులు ఫొటోలు, సెల్ఫీలు దిగారు. నవీన్ 250, అప్పారావు 350కు పైగా చిత్రాల్లో నటించినట్టు చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగే పలు ఈవెంట్స్‌లో పాల్గొనేందుకు ఇక్కడికి వచ్చినట్టు వారు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



దుద్దుకూరులో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తెల్లం రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: దుద్దుకూరులో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఇంటి వద్ద ఆయన సతీమణి తెల్లం రాజ్యలక్ష్మి చేతుల మీదుగా బంజారా జమజరంగీ బేరి కమిటీ క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు భూక్యా వేణు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

సంక్రాంతి పండుగను నియోజకవర్గంలోని ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం

కుక్కునూరు: కుక్కునూరు మండల కేంద్రంలో ఆదివారం రాయి రవి మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఎంఆర్పీఎస్ అండ్ ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు, పోలవరం నియోజకవర్గ పరిశీలకులు విస్సంపల్లి సిద్ధు మాదిగ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల, గ్రామ కమిటీల నిర్మాణం , జెండా దిమ్మ నిర్మాణం ప్రతి గ్రామంలో వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు మాదిగలు , మాదిగ ఉపకులాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భానుప్రసాద్ మాదిగ, శ్రీను మాదిగ రాంబాబు, వీరబాబు మాదిగ, సురేష్ మాదిగ, చిల్లిముంత వెంకటేశ్వర్లు మాదిగ, కొండయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

యల్లాప్రగడకు భారతరత్న ఇవ్వాలి

గణపవరం: యల్లాప్రగడకు భారతరత్న ఇవ్వాలని గణపవరం ఏరియా పీఎంపీ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. ఆదివారం ప్రముఖ శాస్త్రవేత్త యల్లాప్రగడ సుబ్బారావు జయంతి కార్యక్రమాన్ని గణపవరం లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహించారు. ఈ సభకు పీఎంపీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నిడమర్తి జయసూర్య మాట్లాడుతూ మానవాళి శ్రేయస్సు కోసం జీవితాంతం శ్రమపడి ఎన్నో ప్రాణాంతక వ్యాధులకు మందులు కనుగొని ప్రాణదాతగా నిలిచిన యల్లాప్రగడకు భారతరత్న ఇవ్వడం దేశానికే గర్వకారణమని అన్నారు. ప్రముఖ న్యూరాలజిస్టు పి.కృష్ణకిషోర్ న్యూరో సంబంధిత సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మెడ, వెన్నెముక, సయాటికా తదితర నరాల సంబంధించిన వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా వైద్యసహాయం పొందాలని సూచించారు. సమావేశంలో మండల పీఎంపీ అసోసియేషన్ సభ్యులు శివ శ్రీనివాసరావు, వి.అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఏలూరు అందరి లక్ష్యం కావాలి

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛభారత్‌లో భాగంగా మన ఏలూరు- మన పరిశుభ్రత అనే కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆదివారం ఏలూరు పట్టణ సుందరీకరణ పనులు చేపట్టారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి రాధకృష్ణయ్య (చంటి), ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, కోప్షన్ సభ్యులు ఎస్‌యం ఆర్ పెదబాబుతో పాటు పలువురు వలంటీర్లు సుమారు 50 మంది పోలీస్ సిబ్బంది కలిసి ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి జిల్లా ప్రజా పరిషత్ ఆఫీసు వద్ద వరకు ఉన్న డివైడర్లకు వేసిన పెయింటింగ్ పనుల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ మన నగరం- మన ఆస్తి అనే సామాజిక స్పృహతో అందరూ సహకారం అందించాలన్నారు. స్వచ్ఛ ఏలూరుగా హేలాపురి నగరాన్ని తీర్చిదిద్దే కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఎస్పీ శివకిషోర్ మాట్లాడుతూ నగర సుందరీకరణ కార్యక్రమంలో పాలు పంచుకోవడం ఆనందదాయకంగా ఉందన్నారు.

కోడి పందేలకు బరులు సిద్ధం



పందెం బరిలో సై..

కొయ్యలగూడెం: కోడిపందాల నిర్వహణకు ప్రభుత్వం ఇప్పటివరకు అనుమతులు ఇవ్వకున్నా గ్రామాల్లో పందెం బరులను ఆగమేఘాల మీద సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే రామానుజపురంలో భారీ స్థాయిలో పందాల బరి సిద్ధం చేస్తున్నారు. బారికేడ్లు, గ్యాలరీలు, ఫెన్సింగ్ లతో ఏర్పాటు చేశారు. టీడీపీ నేత, వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు పరిమి రాంబాబు ఆధ్వర్యంలో ఇక్కడ కోడిపందాల బరులు సిద్ధం అయ్యాయి. అదేవిధంగా రాజవరం చెరువు గర్భంలో గ్యాలరీలను ఏర్పాటు చేసి కోడిపందాల బరులను నిర్మించారు. నరసన్నపాలెం, రామానుజపురం గ్రామాల మధ్య పామాయిల్ తోటలో మినీ స్టేడియం మాదిరిగా కోడిపందాల బరులు ముస్తాబయ్యాయి. పద్దెనిమిది పంచాయతీల పరిధిలో పన్నెండు చోట్ల కోడిపందాల బరులు పోటాపోటీగా ఏర్పాటు చేసుకున్నారు. కూటమి నాయకులలో అనైక్యత వలన కొన్నిచోట్ల వర్గ పోరులో విడివిడిగా కోడిపందాల బరులు సిద్ధం చేశారు. ఇదే సమయంలో జూద క్రీడలైన పేకాట, కోతాట, గుండాట, వంటి ఇతర క్రీడలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి పందాల రాయుళ్లు సకలం సిద్ధం చేసుకున్నారు.

రోడ్డు పక్కనే పందాల బరులు

కుక్కునూరు: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలో కోడిపందాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పోలీసుల ఆంక్షలు కొనసాగుతున్నా ఇదంతా ప్రతి ఏడాది షరామామూలేగా అన్న దీమాతో నిర్వాహకులు ముందుకు సాగుతున్నారు. వేలేరులో జనసేన. టీడీపీలకు చెందిన వర్గాలు బరులు ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధం చేసుకోగా, చిరవెల్లి, దాచారం, కుక్కునూరు, కివ్వాక గ్రామాల్లోని మొత్తం ఆరు ప్రదేశాలలో కోడిపందాలు నిర్వహించనున్నట్టు తెలుస్తుంది.

సామాన్యులకు ఇక్కట్లు

సంక్రాంతి మూడురోజుల పాటు జరిగే కోడిపందాల కారణంగా ఇక్కడ సాధారణ ప్రజానీకం ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. తమ అవసరాల నిమిత్తం అటు భూర్గంపాడు, ఇటు అశ్వారావుపేట వైపు ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పని పరిస్థితి. మండలంలో ఏర్పాటు చేసిన ప్రతి బరి ఆర్అండ్‌బీ రహదారికి చేరువలో ఉండడమే అందుకు కారణం. గత ఏడాది 108 అంబులెన్స్ కూడా దారి ఇవ్వకుండా పందెం రాయుళ్లు రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయడంతో వేలేరు వద్ద పేషెంట్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లే అంబులెన్స్ సుమారు గంటపాటు వేలేరు వద్ద వేచిఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. అంతేకాక మద్యం మత్తులో ఉన్న పందెం రాయుళ్లు రహదారిపై వెళ్లే వారిపై దౌర్జన్యం చేయడం, గొడవలకు దిగడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. అనధికారికంగా జరిగే కోడిపందేల గురించి పోలీసులు పట్టించుకోకపోయినా రహదారిపై ప్రయాణించే సామాన్యులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సామాన్య ప్రజానీకం డిమాండ్ చేస్తున్నారు.



కొయ్యలగూడెం: రామానుజపురంలో ఏర్పాటుచేసిన పందెం బరి



కుక్కునూరు: ఆర్అండ్‌బీ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన కోడిపందాల బరి



కొయ్యలగూడెం: రాజవరంలో జూద క్రీడల కోసం నిర్మిస్తున్న గ్యాలరీ



కొయ్యలగూడెం: నరసన్నపాలెం రామానుజపురం మధ్య పందాలకు నిర్మిస్తున్న గ్యాలరీలు

అలరించిన కూచిపూడి నృత్యాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం 5 గంటలకు నండూరి శ్రీనివాస్ ఘంటసాల భక్తి సంకీర్తనలు పేరిట వివిధ చలన చిత్రాల్లో ఘంటసాల వెంకటేశ్వరరావు పాడిన భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. సాయంత్రం 6 గంటలకు విజయవాడకు చెందిన మాధురి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో పీపీఏ ప్రసాద్ భక్తి సంగీత విభావరి నిర్వహించారు. రాత్రి 7గంటల నుంచి నగరానికి చెందిన నీరజ కూచిపూడి నాట్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచారిణి నాగమని బుద్ధదేవ్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు విశేషంగా అలరించాయి. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్‌కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

కోడి పందేలకు రెడీ



కోడిపందేలకు కాలు దువ్వుతున్న పందెం కోళ్లు

- పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవంటున్న పోలీసులు
- తగ్గేదేలే అంటున్న పందెంరాయుళ్లు

బుట్టాయగూడెం: సంక్రాంతి పండుగ మూడు రోజులు లక్ష్యంగా చేసుకుని ఏజెన్సీ ప్రాంతంలో జోరుగా కోడిపందేలు జరగనున్నాయి. నిమిషాల వ్యవధిలోనే లక్షలాది రూపాయలు చేతులు మారనున్నాయి. ఒక పక్క పందేలు వేస్తే సహించమంటూ పోలీసులు, రెవెన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా మరోపక్క యథేచ్ఛగా కోడి పందేలు నిర్వహించేందుకు పందెం రాయుళ్లు సిద్ధమవుతున్నారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా అధికారులు పండుగ రోజుల్లో చూసీ చూడనట్లు వదిలేస్తారంటూ పందెంరాయుళ్లు చెప్తున్నారు. ఇప్పటికే పందేల నిర్వహణకు పందెం రాయుళ్లు బరులను కూడా సిద్ధం చేస్తున్నారు. కొన్నిచోట్ల కూటమి నాయకులతో పందేలను ప్రారంభించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. పలుచోట్ల పోలీసులు కోడిపందేలు నిర్వహించే స్థావరాల్లో ఏర్పాటు చేసుకున్న బరులను ధ్వంసం చేస్తున్నారు. మరో పక్క పందెం రాయుళ్లు తగ్గేదేలే అంటూ బరులను సిద్ధం చేస్తూనే ఉన్నారు.

నియోజకవర్గంలో జోరుగా పందేలు

నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, టి.నర్సాపురం, కొయ్యలగూడెం, పోలవరం మండలాల్లో పందేల నిర్వహణకు పందెం రాయుళ్లు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పండుగ మూడు రోజులైనా భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజుల్లో కోడిపందేలతోపాటు గుండాటలు కూడా భారీగా వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుట్టాయగూడెం మండలంలోని బుట్టాయగూడెం, దొరమామిడి, దుద్దుకూరు, రెడ్డిగణపవరం, పాలకుంట, వెలుతురువారిగూడెం, కొమ్ముగూడెం, కొవ్వాడ, తదితర గ్రామాల్లో పందేలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అదేవిధంగా కొయ్యలగూడెం మండలంలో రాజవరం, కొయ్యలగూడెం, రామాంజీపురం గ్రామాల్లో పందేలకు బరులు సిద్ధం చేస్తున్నారు. అలాగే టి. నర్సాపురం మండలంలో బంధంచర్ల, మర్రిగూడెం, శ్రీరామవరం, తిరుమలదేవీపేట గ్రామాల్లోనూ కుక్కునూరులో కివ్వాక, వేలేరు, దాచారం గ్రామాల్లో జీలుగుమిల్లి మండలంలో కామయ్యపాలెం, అంకన్నగూడెం, రాచన్నగూడెం, అంకంపాలెం, జీలుగుమిల్లి గ్రామాల్లో, వేలేరుపాడు మండలంలో భూదేవిపేట, బండ్లపూరు, పోలవరం మండలం పట్టిసీమ, గూటాల, ఎల్ఎన్‌డిపేట గ్రామాల్లో కోడిపందేలు, గుండాట నిర్వహణకు నిర్వాహకులు సిద్ధం చేసుకుంటున్నారు.

పందేలు వేస్తే కఠిన చర్యలు



పండుగల పేరుతో కోడిపందేలు, గుండాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కోడిపందేల నిర్వహణ స్థావరాలను గుర్తించి పందేలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. పందేలు ఆడుతూ పట్టుబడితే కేసులు పెట్టి జైలుకు పంపిస్తాం.

– డి. దుర్గామహేశ్వరరావు, ఎస్సై, బుట్టాయగూడెం

వైఎస్సార్‌సీపీ నేత అప్పలస్వామి మృతి

కొయ్యలగూడెం: బయ్యనగూడెం వైఎస్సార్‌సీపీ నేత, మాజీ గ్రామ కన్వీనర్ బాలం అప్పలస్వామి(54) ఆదివారం ఉదయం తన స్వగృహంలో మృతి చెందారు. గత కొద్దికాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన మృతి చెందినట్లు వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ సమయంలో బయ్యనగూడెం వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించి పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. అప్పలస్వామి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తీవ్ర విచారం వ్యక్తం చేసి, ఆ కుటుంబానికి బాసటగా నిలబడతామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కరాటం కృష్ణస్వరూప్ అప్పలస్వామి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అప్పలస్వామికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వివేకానందుని జీవితం యువతకు స్ఫూర్తి



వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

చింతలపూడి: స్వామి వివేకానంద జీవితాన్ని, స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ పేర్కొన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చింతలపూడిలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎం గోపాలకష్ణ, డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు మణిమాల పాల్గొన్నారు. అనంతరం కిసాన్ అంగడి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రం లోగోను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

బెల్లం దుకాణాల తనిఖీ



చింతలపూడిలో బెల్లం దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

చింతలపూడి: పట్టణంలోని బెల్లం దుకాణాలను ఆదివారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీ చేశారు. బెల్లం నిల్వలను పరిశీలించారు. నాటు సారా తయారీదారులకు, విక్రయదారులకు, బెల్లం అమ్మడం నేరమని వ్యాపారులను హెచ్చరించారు. ప్రతి 15 రోజుల బెల్లం అమ్మకాల వివరాలను, కొనుగోలు చేసిన వారి వివరాలు స్థానిక ఎక్సైజ్ స్టేషన్ అధికారులకు తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. ఈ మేరకు వ్యాపారులకు నోటీసులు అందజేసినట్లు సీఐ పి అశోక్ తెలిపారు. అదే విధంగా ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని బ్రాందీ షాపులను తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు , అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు సత్కారం



జంగారెడ్డిగూడెం క్రీస్తు లూథరన్ దేవాలయంలో ప్రభుత్వ ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన నలుగురు ప్రభుత్వ ఉద్యోగులను ఆదివారం స్థానిక క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఘనంగా సత్కరించారు. బాల్య వివాహాల నిరోధానికి కృషి చేసిన సీడీపీవో పరిమి బ్యూలా, వైద్య వృత్తిలో విశేష సేవలందిస్తున్న కుసుమ ఎస్తేర్ రాణి, ఏరియా ఆసుపత్రిలోని స్టాఫ్ నర్స్‌గా ఉత్తమ సేవలందిస్తున్న రాచప్రోలు రాజేశ్వరి, జంగారెడ్డిగూడెం ఎంపీపీ పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్న గద్దం విజయనిర్మలను దుశ్శాలువాలతో ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. పాస్టర్ జి రమేష్ బాబు, అరుణ, కమిటీ సభ్యులు గుండుమాల నతనియేలు, సభితి రవి ప్రసాద్, కొడమంచిలి మార్టిన్, మరపట్ల సువర్ణ, గద్దం విజయనిర్మల, బయ్యి ఏసురత్నం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చింతలపూడి: ప్రగడవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996–97 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ఆనాటి మిత్రులంతా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాటి మధురస్మృతులు నెమరవేసుకుంటూ రోజంతా ఉత్సాహంగా గడిపారు. అలనాటి జ్ఞాపకాలను చెప్పుకుంటూ సహపంక్తి భోజనాలు చేశారు. అప్పటి తెలుగు ఉపాధ్యాయులు ఎస్‌వీకెఎన్ సత్యన్నారాయణ రాజు, విశ్వ సుందరం మాస్టార్లను ఘనంగా సత్కరించుకున్నారు. పూర్వ విద్యార్థులు సీహెచ్ నరేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సీహెచ్ దినేష్, పల్లె చందాలు, జీవీఎస్ సుధీర్, సరిపల్లె వెంకటేశ్వరరావు, కె వెంకట్రావు, తమ్మిశెట్టిల ఆధ్వర్యంలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు.

17న రైతుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా

ఏలూరు (టూటౌన్): రైతాంగ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 17న విజయవాడలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏప రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అన్నే భవనంలో ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం, గ్రీన్ ఫీల్డ్ హైవే, జీలుగుమిల్లి నుంచి పోలవరం వరకు జాతీయ రహదారి భూ నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని, గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రావిజన్ కల్పించాలని, బలవంతపు భూసేకరణ ఆపాలన్నారు.

పీఎం ఉపాధి కల్పన పథకంలో పరిశ్రమలకు రుణాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంలో ఆధునిక యంత్ర పరికరాల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు రాయితీతో కూడిన రుణాలు మంజూరవుతాయని, యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు. ఏలూరు ఇండస్ట్రియల్ ఏరియాలో పీఎంఈజీపీ పథకం ద్వారా నూతనంగా ప్రారంభించిన అభి ఇంటీరియల్స్ మాడ్యులర్ కిచెన్ కప్‌బోర్డ్ పరిశ్రమను ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి ఎంపీ ఆదివారం ప్రారంభించారు.

సంక్రాంతి సందడి

కొయ్యలగూడెం: సంక్రాంతి పండుగ సందర్భంగా కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆలయ కమిటీ, అభ్యుదయ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 45 మంది మహిళలు పాల్గొన్నారు. విజేతలకు రూ.10 వేల విలువైన బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న ముస్లిం మహిళ షేక్ హుస్సేన్ బీని రసవిపంచి కళావేదిక సభ్యులు అనిపెద్ది రాధాకృష్ణ, నిడదవోలు రామారావు అభినందించి ప్రత్యేక బహుమతిని అందించారు. ధర్మారావుపేటలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి రూ.50 వేల విలువైన బహుమతులను విజేతలకు అందజేశారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు గోదారంగనాథుని కల్యాణాన్ని నిర్వహించి ఆకట్టుకున్నారు. పలుచోట్ల చిన్నారులకు భోగి పండ్లు పోసి పెద్దలతో ఆశీర్వచనాలు పొందారు.

కుక్కునూరు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య, సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక హైస్కూల్ మైదానంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో విజేతలైన మహిళలకు బహుమతులు అందజేశారు.



కొయ్యలగూడెం: భోగి మంటలు వెలిగించి కోలాటం నిర్వహిస్తున్న దృశ్యం



కొయ్యలగూడెం: ధర్మారావుపేటలో సంక్రాంతి సంబరాలు



కుక్కునూరు: మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



కొయ్యలగూడెం: ముగ్గుల పోటీలలో పాల్గొన్న షేక్ హుస్సేన్‌బీ